క్లుప్తంగా

19న గ్రూప్స్ అభ్యర్థులకు అవగాహన సదస్సు

కడప కల్చరల్ : కడప నగరంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఈనెల 19వ తేదీన గ్రూప్స్ పరీక్షలు రాయనున్న అభ్యర్థులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నామని బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య టి.రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. సాయంత్రం 4 గంటలకు జరగనున్న ఈ సదస్సులో స్థానిక టర్నింగ్ పాయింట్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ జి.ఉత్తమ్‌రెడ్డి పరీక్షలు రాసే అభ్యర్థులకు ఉపయోగపడే వివిధ అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. ఇందులో భాగంగా సిలబస్, ప్రిలిమ్స్‌లో ఎలా అర్హత సంపాదించాలి? ఏ సబ్జెక్టుపై పట్టు సాధించాలి? టైం టేబుల్ ఎలా తయారు చేసుకోవాలి? తదితర అంశాలపై విశ్లేషణాత్మక వివరణ ఇస్తారన్నారు.

వయో పరిమితి పెంచాలి

కడప ఎడ్యుకేషన్: ఏపీ ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన గ్రూపు–1, 2 పోస్టు అభ్యర్థుల వయో పరిమితిని 42 సంవత్సరాల నుంచి 45 సంవత్సరాలకు పెంచాలని అఖిల భారత విద్యార్థి సంఘం (ఏఐఎస్‌యు) రాయలసీమ అధ్యక్షుడు సిపి నాగేంద్ర డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విషయంలో ప్రభుత్వం స్పందించి 42 నుంచి 45 సంవత్సరాలకు వయసును పెంచాలన్నారు. నిరుద్యోగుల మీద ప్రభుత్వానికి చిత్తుశుద్ధి ఉంటే నిరుద్యోగుల పక్షాల నిలబడి వయో పరిమితితోపాటు ఉద్యోగుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రకాష్ రాజేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలపై ప్రజా ప్రతినిధుల వ్యాఖ్యలు సరికాదు

కడప ఎడ్యుకేషన్: అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు గత ఐదు రోజులుగా తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో చేపట్టిన సమ్మె పట్ల ప్రజాప్రతినిధులు చేసిన అనుచిత వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, వెంకటసుబ్బయ్యలు డిమాండ్ చేశారు. శనివారం కడపలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మె కు ఎస్టీయూ నాయకులు తమ మద్దతును ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి ఇలియాస్‌బాషా, కడప రీజనల్ కన్వీనర్ అబ్దుల్ వాజిద్, అంగన్‌వాడీ సంఘం ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఖాదర్‌బాషా

కడప ఎడ్యుకేషన్: కడప నగరంలోని పుట్‌పాత్‌పై ఉండే నిరుపేదలకు జెకె జనం కోసం యూత్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సొసైటీ వ్యవస్థాపకులు లయన్ పఠాన్ ఖాదర్‌బాష ఆధ్వర్యంలో 50 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజుల నుంచి జిల్లాలో చలితీవ్రత బాగా పెరిగిందన్నారు. దీనికి తోడు వర్షాలు రావడం, చలిగాలులు వీచడంతో యాచకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారికి దుప్పట్లును పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ అబ్దుల్లా, గురుగోల్డ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్‌ఫెయిర్

పెండ్లిమర్రి : విద్యార్థి దశ నుంచి శాస్త్రీయ దృక్పథాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉందని ఎంఈఓ సుజాత అన్నారు. పెండ్లిమర్రి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం మండల స్థాయి సైన్స్ ఫెయిర్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రథమ స్థానం సాధించిన 3 నమూనాలను జిల్లా స్థాయికి పంపించామని తెలిపారు. విద్యార్థి దశ నుంచే సృజనాత్మకంగా ఆలోచించడం అలవాటు చేసుకోవాలన్నారు. పరిశీలన దృష్టి పెంచుకోవాలని, అధ్యయనం చేసే శక్తి సంపాదించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం కళావతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం



సౌజన్య

కడప అర్బన్: కడప నగరంలోని ఐటీఐ సర్కిల్ సమీపంలోని అక్కాయపల్లిలో నివసిస్తున్న సౌజన్య (33) అనే మహిళ శుక్రవారం మధ్యాహ్నం ఇంటి నుంచి డ్యూటీకీ వచ్చి తరువాత కనిపించడం లేదని ఆమె భర్త నిత్యానందరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. 11 సంవత్సరాల క్రితం సౌజన్యకు, నిత్యానందరావుకు వివాహమైంది. సౌజన్య కడప నగరంలోని అప్సరా థియేటర్ సమీపంలోని ఓ ఫైనాన్స్ సంస్థలో పనిచేస్తోంది. ఈనెల 15వ తేదీన మధ్యాహ్నం విధులకు వెళ్లిన ఆమె తరువాత తిరిగి రాలేదు. అన్ని చోట్ల వెతికి శనివారం సాయంత్రం చిన్నచౌక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు 9121100520, 9121100521 సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు. భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

ధనుర్మాసం... భక్తిమార్గం

- నేటి నుంచి విశేష పూజలు
- తిరుప్పావై సేవలు ప్రారంభం
- కళకళలాడనున్న వైష్ణవాలయాలు


కడప కల్చరల్ : సూర్య కిరణాలు భూమాతను తాకుతున్న వేళ....చల్లని మంచుతెరలు పరుచుకుంటున్న సమయం....పూర్తిగా తెల్లవారకముందే వీధుల్లో మహిళలు కళ్లాపి చల్లుతున్న మెత్తని చప్పుడు..రంగురంగుల ముగ్గుల సిగ్గులను అలంకరించుకుంటున్న ఇళ్ల ప్రాంగణాలు... ధనుర్మాసం రానే వచ్చిందని చెప్పకనే చెబుతున్నాయి. ఈనెల 17వ తేదీ ఆదివారం నుంచి ధనుర్మాసం ప్రారంభం కానుంది. నెలరోజులంతా వైష్ణవాలయాలు విశేష పూజలతో సందడిగా మారనున్నాయి. ఈ మాసమంతా ఆధ్యాత్మిక వాతావరణం నిండుతుంది. తెల్లవారకముందే వైష్ణవాలయాల్లో భక్తులు పూజల కోసం వస్తారు. ఉదయం, సాయంత్రం పాశురాల గానం వినిపిస్తుంది. మాసాలలో ధనుర్మాసాన్ని అత్యంత పవిత్రమైనదిగా భావిస్తారు. ఈ సందర్భంగా ధనుర్మాసం నిర్వహణ గురించిన వివరాలు.

– జిల్లాలో పలు ప్రముఖమైన వైష్ణవాలయాలు ఉన్నాయి. ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి ఆలయం, దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయం, నందలూరు శ్రీ సౌమ్యనాథస్వామి ఆలయం, గండి శ్రీ వీరాంజనేయస్వామి ఆలయం, పుష్పగిరి శ్రీ చెన్నకేశవస్వామి ఆలయం, జమ్మలమడుగు శ్రీ నారాపురస్వామి ఆలయం, తాళ్లపాక చెన్నకేశవస్వామి ఆలయం, ఇంకా పలు వైష్ణవాలయాలు ఈ మాసమంతా విశేష పూజలతో కళకళలాడుతాయి. ప్రతి ఆలయంలో తెల్లవారకముందే విశేష పూజలు ప్రారంభమవుతాయి. ఉదయం, సాయంత్రం గోదాదేవి గానం చేసే పాశురాలు ఆయా ఆలయాలలో వినిపిస్తాయి.

నగరంలో..

కడప నగరం దేవునికడప క్షేత్రంలో ఆదివారం నుంచి ధనుర్మాస ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా కడప రాయుని ఆలయంలో ఉదయం 4.30 గంటలకే ఆలయ ప్రాంగణంలో ఉత్తరం వైపుగల శ్రీ ఆండాళ్ అమ్మవారి మందిరంలో విశేష అభిషేకాలు, అలంకారాలు, పూజలు చేస్తారు. ఈ సందర్భంగా ప్రతిరోజు ఒకటి చొప్పున పాశురాలను గానం చేస్తారు. మరికొన్ని వైష్ణవాలయాలలో ప్రతిరోజు 30 పాశురాలను ఆలపిస్తారు. ఆలయం దక్షిణానగల ఆళ్వార్ల సన్నిధిలో పూజలు చేస్తారు. వారి పేరిట స్వామికి ప్రత్యేక పూజలు, నివేదనలు నిర్వహిస్తారు. వైకుంఠ ఏకాదశికి ముందు, ఆ తర్వాత ఆళ్వార్ల పేరిట ×రాపత్తు, పగలు పత్తు• అధ్యయనోత్సవాలు నిర్వహిస్తారు. సంక్రాంతి పండుగ సందర్భంగా గోదాదేవి ప్రతిరూపమైన శ్రీ ఆండాళ్ తాయార్ అమ్మవారికి విశేష పూజలు చేసి స్వామితోసహా పారువేట కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

– కడప నగరంలోని ఎన్జీఓ కాలనీలోగల శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం, జవుళి బజారు (బీకేఎం వీధి) శ్రీ కోదండ రామాలయం, గడ్డి బజారులోని శ్రీ సత్యనారాయణస్వామి ఆలయం, ఇంకా నగరంలోని పలు రామాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. జవుళి బజారు రామాలయంలో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేద పండితుల ఆధ్వర్యంలో పాశురాల గానం, ధనుర్మాసం విశిష్టతలపై ప్రసంగాలు నిర్వహిస్తారు.



దేవుని కడప ఆలయంలో ఆండాళ్ తాయారు అమ్మవారి మందిరం

300 బస్తాల సిమెంటు వితరణ



ఆలయ నిర్మాణానికి అందజేసిన సిమెంటు బస్తాలను చూపుతున్న నాయకులు

చెన్నూరు : మండలంలోని దౌలాతాపురం (షుగర్ ఫ్యాక్టరీ) గ్రామంలో నిర్మిస్తున్న శ్రీ సీతారామ ఆలయానికి కమలాపురం శాసనసభ్యులు పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి తనయుడు చింతకొమ్మదిన్నె జెడ్పీటీసీ సభ్యుడు పోచంరెడ్డి నరేన్ రామాంజులరెడ్డి 300 బస్తాల సిమెంటు వితరణగా అందించారు. ఈ విషయాన్ని షుగర్ ఫ్యాక్టరీ వైఎస్ఆర్‌సీపీ నాయకులు నాగినేని వెంకటరమణ, సొరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, కరుణాకర్, మహేష్‌రెడ్డి శనివారం విలేకరులకు తెలిపారు.

దివ్యాంగుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

- 1203 మందికి ఉపకరణాల పంపిణీ
- ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి



దివ్యాంగులకు బ్యాటరీ ట్రైసైకిల్స్ అందిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : దివ్యాంగుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం అని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక బాలయోగి గురుకుల పాఠశాలలో వికలాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కృష్ణ కిషోర్ ఆధ్వర్యంలో సామాజిక అధికార శిబిర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే నియోజకవర్గంలోని 1203 మంది దివ్యాంగులకు రూ.1.20 కోట్ల విలువ చేసే బ్యాటరీ ట్రైసైకిల్స్, చెవిటి యంత్రాలు, కర్రలు తదితర ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల నుంచి వచ్చిన అర్జీలను ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ద్వారా కేంద్ర మంత్రి నారాయణస్వామి దృష్టికి తీసుకెళ్లి ఇంత మందికి ఉపకరణాలు మంజూరు చేశామన్నారు. అలాగే ఎంపీ తన నిధుల నుంచి రూ.89 లక్షలు ఈ పథకానికి జోడించారన్నారు. జిల్లా వ్యాప్తంగా 42 క్యాంపులు నిర్వహించి అర్హులను గుర్తించామన్నారు. ఇంకా ఎవరైనా అర్హులు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని, వారందరికీ ఉపకరణాలు ఇస్తామన్నారు. ఇపుడు దరఖాస్తు చేసుకున్న వారికి జగనన్న జన్మదినోత్సవం రోజున పంపిణీ చేస్తామన్నారు. దివ్యాంగులతోపాటు వితంతువులు, వృద్ధులకు ప్రతి నెల 1వ తేదీనే ఠంఛన్‌గా ఇంటికెళ్లి పింఛన్ పంపిణీ చేస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. త్వరలో వచ్చే ఎన్నికల్లో దివ్యాంగులందరూ జగనన్నకు తోడు, నీడ, అండగా, బాసటగా నిలవాలన్నారు. రాష్ట్ర ఉద్యాన శాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీలకతీతంగా జగనన్న సంక్షేమ పథకాలు అందిస్తున్నారని కొనియాడారు. దివ్యాంగులు ఇబ్బందులు పడకూడదని ప్రతి గ్రామంలో వైద్య శిబిరాలు నిర్వహించి ట్రై సైకిల్స్ తదితర ఉపకరణాలు పంపిణీ చేశారన్నారు. ఆర్డీఓ మధుసూదన్ మాట్లాడుతూ దివ్యాంగులకు ఇన్ని రకాల ఉపకరణాలు పంపిణీ చేయడం హర్షణీయం అన్నారు. ఎస్ఎస్ఏ పీఓ అంబవరం ప్రభాకర్‌రెడ్డి, డ్వామా పీడీ యదుభూషణ్ రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఉత్తమారెడ్డి, రాజుపాలెం సుబ్బారెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, ఎస్సీ పుల్లారెడ్డి, గంగాధర్ రెడ్డి, ఎంపీపీ గండిభాస్కర్, వైస్ ఎంపీపీ చెన్నకేశవ రెడ్డి, మండల స్పెషల్ ఆఫీసర్ నరసింహారెడ్డి, ఎంపీడీఓ జ్యోతి, తహసీల్దార్ సరస్వతి, ప్రిన్సిపల్ తులసమ్మ తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

చెన్నూరు : మండలంలోని శివాలపల్లె గ్రామం సమీపంలో వెలసిన శ్రీ కాశీ విశ్వనాథస్వామి ఆలయానికి కార్తీక మాసోత్సవాల సందర్భంగా వచ్చిన హుండీ ఆ ఆదాయాన్ని శనివారం చైర్మన్ శివారెడ్డి, శ్రీనివాసులు ఆధ్వర్యంలో లెక్కించారు. మొత్తం రూ.1,09,600 వచ్చినట్లు వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముమ్మడి సుదర్శన్ రెడ్డి, ఇందిరెడ్డి శివారెడ్డి, పోలు రామచంద్రారెడ్డి, ఆర్‌సీ కొండారెడ్డి, పెద్ద పుల్లయ్య, ఆలయ ప్రధాన అర్చకులు సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

వీరపునాయునిపల్లె : ప్రకృతి వ్యవసాయంతో నిరంతరం లాభాలు పొందచ్చని మండల సమాఖ్య ప్రాజెక్టు అధికారి భాగ్యమ్మ అన్నారు. శనివారం మండలంలోని అనిమెల గ్రామంలో పలువురు రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన పంటలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ, మండల సమాఖ్య సభ్యులు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పలు రకాల పంటలు సాగు చేయాలని తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయంతో పంటలు పండించి ఆరోగ్యకమైన ఆహారం తీసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏడీపీఎం వసంతకుమారి, మండల సమాఖ్య అధ్యక్షురాలు అర్చన, సీసీలు, రైతులు పాల్గొన్నారు.

పశువైద్యశాల వాహనాలు అందుబాటులో ఉండాలి

పెండ్లిమర్రి : వైఎస్సార్ సంచార పశు వైద్యశాల వాహనాలు రైతులకు అందుబాటులో ఉండాలని సంచార పశువైద్యశాల రాష్ట్ర కార్యదర్శి కలీం అన్నారు. పెండ్లిమర్రిలో శనివారం పశువైద్యశాల వాహనాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1962 హెల్ప్‌లైన్‌కు కాల్ చేసిన వెంటనే అందుబాటులో ఉండి పశువులకు వైద్య సేవలు అందించాలన్నారు. ప్రతినిత్యం వాహనాలు రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం వాహనాల పనితీరు, సేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

సోమేశ్వరుని సన్నిధిలో న్యాయమూర్తులు



శ్రీ సోమేశ్వరుడిని దర్శించుకుంటున్న హైకోర్టు న్యాయమూర్తి భానుమతి

కడప కల్చరల్ : కడప నగరం దేవునికడపలోని శ్రీ సోమేశ్వరస్వామిని శనివారం ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తి భానుమతి దర్శించుకున్నారు. జిల్లా జడ్జి జి.శ్రీదేవి, రెండవ అదనపు జిల్లా జడ్జి భార్గవిలతో కలిసి వచ్చిన ఆమెకు ఆలయ నిర్వాహకులు ఎ.శ్రీధర్, అర్చక బృందం సంప్రదాయ స్వాగతం పలికారు. ప్రదక్షిణల అనంతరం స్వామి వారి మూల విరాట్‌ను దర్శించుకుని పూజలు నిర్వహించారు. అర్చకులు వారికి వేదాశీస్సులు, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ప్రతి కుటుంబానికి క్రీస్తు దీవెనలు

కడప కల్చరల్ : ప్రతి కుటుంబానికి క్రీస్తు దీవెనలు అందాలని ఆరోగ్యమాత పుణ్యక్షేత్రం డైరెక్టర్ ఫాదర్ ఎండీ ప్రసాద్‌రావు అన్నారు. క్రిస్మస్ ముందస్తు కార్యక్రమాల్లో భాగంగా క్యారల్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం స్థానిక ఇందిరానగర్, సాయిబాబా నగర్, మామిళ్లపల్లె, మౌంట్‌ఫోర్ట్ పాఠశాల, రిమ్స్ తదితర ప్రాంతాల్లోని క్రైస్తవ కుటుంబాలను కలిసి వారి ఇళ్లల్లో ప్రత్యేకంగా ప్రార్థనలు చేశారు. ఇందులో భాగంగా విశ్వాసి మడగలం ప్రసాద్ ఇంటిలో కుటుంబ సభ్యులతో కలిసి కేక్ కట్ చేసి క్రిస్మస్ ముందస్తు వేడుకలు సంబరంగా నిర్వహించుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో ఆరోగ్యమాత క్షేత్రం సహాయ డైరెక్టర్ విల్సన్, మదర్ జనరల్ సుపీరియర్ సెల్వి రాయప్పన్, శాంతి సేవా సొసైటీ వ్యవస్థాపకులు మడగలం ప్రసాద్, చర్చి పెద్దలు, యువత తదితరులు పాల్గొన్నారు.

ఆకేపాటి పాదయాత్రకు ఘన స్వాగతం



ఆకేపాటికి స్వాగతం పలుకుతున్న కడప మేయర్ సురేష్‌బాబు

ఓబులవారిపల్లె: అన్నమయ్య కాలిబాటలో జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ రెడ్డి చేస్తున్న తిరుమల పాదయాత్రకు శనివారం మండలంలో ఘన స్వాగతం లభించింది. కొర్లకుంట అడ్డరోడ్డులో ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి, సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. చిన్నంపల్లె వద్ద మాజీ ఎంపీపీ తమ్మెద తిరుపాల్, మంగంపేట వద్ద డీఆర్‌సీసీయూ మెంబర్ తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి భారీ క్రాయిన్ సహాయంలో గజమాలతో పెద్ద ఎత్తున మహిళలు స్వాగతం పలికారు. ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతు జెడ్పీచైర్మెన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి 21వ అన్నమయ్య కాలిబాట వెళ్లడం ,అన్నమయ్య కాలిబాటలో వందలదిమంది గోవిందమాల ధారులతో కలియుగ దైవం వెంకటేశ్వరస్వామి సన్నిధికి చేరుకొని దర్శించుకొవడం గొప్పవిషయమని అన్నారు. అంతకుముందు కడప మేయర్ సురేష్‌బాబు పాదయాత్రలో పాల్గొన్నారు. జిల్లా వ్యవసాయ మండలి కమిటీ చైర్మెన్ పంజం సుకుమార్‌రెడ్డి, సీనియర్ నాయకులు ముక్కా మధుసుధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కడప కార్పొరేషన్: ఒంటిమిట్ట నుంచి 21 సంవత్సరాలుగా తిరుమలకు పాదయాత్ర చేయడం సామాన్యమైన విషయం కాదని వైఎస్సార్‌సీపీ నాయకులు పి. జయచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు బంగారు నాగయ్య యాదవ్, రాజా ప్రతాప్ అన్నారు. తిరుమలకు పాదయాత్ర చేస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డిని వారు ముక్కవారిపల్లె క్రాస్ వద్ద కలిసి సత్కరించారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

కమలాపురం: కమలాపురం మునిసిపాలిటీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిలర్లు, అధికారులు, కాంట్రాక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మునిసిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులను సమీక్షించారు. డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్, రోడ్లు, రోడ్డు విస్తరణ, డివైడర్, సుందరీకరణ తదితర పనులపై సమీక్షించారు. సంబంధిత కాంట్రాక్టర్లు, అధికారులతో సమీక్షించారు. పనులు ఎప్పటిలోపు పూర్తి చేస్తారని ఆరా తీశారు. అన్ని పనులు నెలాఖరుకు పూర్తి చేయాలన్నారు. అధికారులు, కాంట్రాక్టర్లు సమన్వయంతో, నాణ్యతగా చేపట్టాలన్నారు. ఇప్పటికే పట్టణంలో పాలిటెక్నిక్ కళాశాల, 30 పడకల ఆసుపత్రి, డ్రైనేజ్ కాలువలు తదితరాలు పూర్తి చేశామన్నారు. ముఖ్యంగా ఆర్‌ఓబీ, మున్సిపల్ కార్యాలయ పనులు ప్రారంభించాలని ఆదేశించారు. ఖాజీపేట ప్రధాన రహదారిలో ఉన్న వంతెన నిర్మాణ పనులను చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మార్పురి మేరి, వైస్ చైర్మన్లు మహ్మద్ సాధిక్, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, ఎస్సీ పుల్లారెడ్డి, గంగాధర్‌రెడ్డి, ఆర్‌వీఎస్‌ఆర్, కమిషనర్ రాముడు, పబ్లిక్ హెల్త్ ఈఈ చెన్నకేశవరెడ్డి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నాటక ప్రదర్శన



నాటకంలోని ఓ దృశ్యం

కడప కల్చరల్ : క్రిస్మస్ ముందస్తు వేడుకల్లో భాగంగా స్థానిక సీఎస్ఐ సెంట్రల్ చర్చి ఆవరణలో ప్రదర్శించిన ×కంటాటా• నాటకం చారిత్రక దృశ్య కావ్యంగా సాగి ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. చర్చి పెద్దలు, నిర్వాహక కమిటీ ప్రతినిధులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ నాటకంలో దాదాపు 70 మందికి పైగా కొరియన్ కళాకారులు పాల్గొని రక్తికట్టించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వేదికపై నాటి క్రీస్తు జీవిత విశేషాలకు సంబంధించిన విశేషాలను అత్యంత సహజమైన సెట్టింగులతో రూపొందించి ఆకట్టుకున్నారు. దానికి తగినట్లు వేదిక లైటింగ్, స్పాట్ లైటింగ్, అంతకుమించిన స్పష్టమైన స్టీరియో సౌండ్ సిస్టమ్ ప్రేక్షకులను నాటకంలో లీనమయ్యేలా చేసింది. నాటకానికి ముందు క్రైస్తవ ప్రముఖులు చేసిన ఆధ్యాత్మిక ప్రసంగం ఆకట్టుకుంది. కార్యక్రమానికి కమలాపురం శాసనసభ్యులు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, సోషల్ వెల్ఫేర్ బోర్డు రాష్ట్ర చైర్మన్ పులి సునీల్‌కుమార్, సీఎస్ఐ చర్చి పెద్దలు, గురువులు, స్థానిక క్రైస్తవ ప్రముఖులు, కమిటీ సభ్యులు, స్థానిక క్రైస్తవులు భారీ సంఖ్యలో హాజరయ్యారు.



కార్యక్రమానికి హాజరైన ప్రముఖులు, విశ్వాసులు

శాస్త్రీయ విజ్ఞానం ద్వారా సమాజ అభివృద్ధి

- డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్: శాస్త్రయ విజ్ఞానం ద్వారానే సమాజ అభివృద్ధి జరుగుతుందని కడప డివిజన్ డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి సూచించారు. శనివారం కడప జయనగర్‌కాలనీ జిల్లా పరిషత్తు బాలికల ఉన్నత పాఠశాలలో ఎంఈఓలు పాలెం నారాయణ, ఇర్షాద్ అహ్మద్‌ల ఆధ్వర్యంలో మండల స్థాయి సైన్సుఫెయిర్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుండి విజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థులు తమలో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసి ప్రాజెక్టులను తయారు చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. ఇలా చేయడం ద్వారా జీవితంలో ఇంకా మంచి ప్రాజెక్టులను చేసి అత్యున్నత స్థాయికి చేరుకుంటారని అన్నారు. జిల్లా సైన్సు అధికారి మహేశ్వరెడ్డి మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు సైన్సుపట్ల మక్కువ పెంచుకోవాలన్నారు. విద్యార్థుల నిజజీవితంలో సైన్సు ఎంతో ముఖ్యమన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ప్రభుత్వం ప్రతి ఏటా సైన్సుఫేర్‌ను నిర్వహిస్తుందన్నారు. ఈ నెల 19వ తేదీ జిల్లాస్థాయితోపాటు రాష్ట్రస్థాయి సైన్సుఫేర్‌ను కూడా కడపలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కడప మండల విద్యాశాఖ అధికారులు పాలెం నారాయణ, ఇర్షాద్ అహ్మద్, సికెదిన్నె ఎంఈఓ వెంకటరామిరెడ్డిలు విద్యార్థులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం భాగ్యవతి పాల్గొన్నారు.

చిట్టి చేతులు... గట్టి ఆలోచనలు

కడప కల్చరల్ : కడప నగరం నజీముల్ అమీన్ పబ్లిక్ స్కూలులో హైస్కూలు విద్యార్థులతో సైన్స్ ఫెయిర్ నిర్వహింపజేశారు. ప్రధానోపాధ్యాయులు ఖాదర్‌బాష, ఇన్‌ఛార్జి, ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో వంద మంది విద్యార్థులు బృందాలుగా 100కి పైగా ఆవిష్కరణలు చేశారు.

జాతీయ సాహస శిక్షణా శిబిరానికి వైవీయూ విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్: యోగివేమన విశ్వ విద్యాలయం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో పదిమంది వలంటీర్లు హిమాచల్‌ప్రదేశ్ హాల్ కోటిలో నిర్వహించే జాతీయ సాహస శిక్షణ శిబిరానికి బయలు దేరి వెళ్లారు. వైవీయూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ ఎన్. వెంకటరామిరెడ్డి, పీవో డాక్టర్ కే. శ్రీనివాసరావు ఈ ప్రయాణాన్ని ప్రారంభించారు. ఈ నెల 19వ తేదీ నుంచి 28వ తేదీ వరకు జరిగే ఈ శిక్షణలో పర్వతారోహణ, వాటర్రాఫింగ్(నీటిలో తెప్పకట్టడం) పారా పెయిలింగ్(ఓడ నడపడం), ప్రాథమిక స్టైయింగ్‌లలో శిక్షణ ఇస్తారని ఆయన తెలిపారు. ఈ శిక్షణకు ఎంపికైన విద్యార్థులను విశ్వ విద్యాలయ ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్, కులసచివులు ఆచార్య వెంకటసుబ్బయ్య, ప్రధానాచార్యులు రఘునాథరెడ్డిలు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ శిక్షణను విద్యార్థులు విజయవంతంగా పూర్తి చేసుకుని రావాలని శుభాకాంక్షలు తెలిపారు.



జాతీయ సాహస శిక్షణ శిబిరానికి పయనమైన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు